TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony, Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 212 | గురువారం 21 నవంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper

## ఎగ్జిట్‌పోల్స్ చర్చల్లో పాల్గొనబోం




**ముంబయి:** మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే మహారాష్ట్రలో 45 శాతానికి పైగా ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. నేటి సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎగ్జిట్ పోల్స్ చర్చల్లో తాము పాల్గొనడం లేదంటూ పార్టీ సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. 288 నియోజవర్గాలున్న మహారాష్ట్రలో ఒకే విడతలో నేడు పోలింగ్ కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 45.53శాతం పోలింగ్ నమోదైంది. మరోవైపు, ఝూర?ండ్‌లో 61. 47 శాతం ఓటింగ్ జరిగింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు సినీ, క్రీడా సెలబ్రిటీలు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్, బాలీవుడ్ ప్రముఖులు అక్షయ్ కుమార్, రితేశ్ దేశ్‌ముఖ్-జెనీలియా, సైఫ్ అలీఖాన్-కరీనా కపూర్, రకుల్ ప్రీత్ సింగ్ దంపతులు, సంగీత దర్శకుడు శంకర్ మహదేవన్, నటి ట్వింకిల్ ఖన్నా, శ్రద్ధాకపూర్ సహా పలువురు ప్రముఖులు ఓటు వేశారు. ముంబయిలో నివాసముంటున్న 113 ఏళ్ల కాంచన్‌బెన్ కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకోవడం అందరి బాధ్యత అంటూ స్ఫూర్తి నింపారు. కాగా.. కాసేపట్లో పోలింగ్ పూర్తయి ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ చర్చల్లో పాల్గొనడం లేదని తెలుస్తోంది.

## సూపర్-6 హామీల విషయంలో ప్రభుత్వం ఫెయిల్



**తాడేపల్లి:** సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. హామీలు అమలు చేయలేకే చంద్రబాబు బడ్జెట్ ఆలస్యం చేశారు. బడ్జెట్ ప్రవేశపెడితే రాష్ట్రానికి ఉన్న అప్పులు చూపించక తప్పదని చెప్పారు. అబద్ధాలనే నిజాలుగా నమ్మించే యత్నానికి తెరలేపిన చంద్రబాబు సర్కార్‌పై వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు అబద్ధాలు చెప్పారు. ఆయనను బొంకుల బాబు అని ఎందుకు అనకూడదు?" అంటూ వైయస్ జగన్ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైయస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్ మీడియా సమావేశంలో మాట్లాడారు.



# టూరిజం పాలసీకి ఆమోదం

**అమరావతి:** సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన ఏపీ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏపీ టూరిజం పాలసీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పర్యాటక ప్రాజెక్టులకు పరిశ్రమ హోదా కల్పించే ప్రతిపాదనపై చర్చించి ఆమోదించింది. జ్యుడిషియల్ ప్రివ్యూ రద్దు బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ ఇన్‌ఫ్రా ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్ 2019 రిపీట్ చేయాలని ప్రతిపాదించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో స్థానిక సంస్థల్లో ఛైర్మన్లపై అవిశ్వాసం పెట్టే అంశంపై చట్ట సవరణ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అవిశ్వాసం పెట్టే గడువును నాలుగేళ్ల నుంచి రెండేళ్లకి కుదిస్తూ చట్ట సవరణ చేశారు. 2024- 25 కొత్త క్రీడా పాలసీకి క్యాబినెట్లో ఆమోదం లభించింది. డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ పేరును ఈగల్‌గా (ఎలైట్ యాంటీ నార్కటిక్ గ్రూప్‌గా) మారుస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కోసం గృహ నిర్మాణ శాఖ చేసుకోనున్న ఒప్పందానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ టవర్స్ లిమిటెడ్‌ను ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్‌లో విలీనం చేసేందుకు క్యాబినెట్ ఆమోదం లభించింది. ఏపీ టవర్స్ లిమిటెడ్‌కు చెందిన మూలధనం, ఆస్తులు, అప్పులు బదలాయిస్తూ ప్రతిపాదన చేశారు.

- నేరాలను నియంత్రించేందుకు పీడీ యాక్ట్ పటిష్ఠం చేస్తూ సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం.
- లోకాయుక్త చట్టసవరణ బిల్లుకు ఆమోదం. లోకాయుక్త నియామకంలో ప్రతిపక్ష నేత లేనప్పుడు ఏం చేయాలనేదానిపై చర్చించారు. పార్లమెంట్‌లో అనుసరించిన విధానం కొనసాగించాలని నిర్ణయించారు.
- రాష్ట్రంలో రూ.85వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎస్ఐపీబీ నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం
- దేవాలయ కమిటీల్లో ఇద్దరు సభ్యులకు చోటు కల్పించేలా చట్టసవరణ బిల్లుకు ఆమోదం
- కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయిం తీసుకున్నారు
- అమరావతి సాంకేతిక కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం. కొత్తగా టెండర్లు పిలిచి అమరావతి నిర్మాణ పనులు కొంసాగించేలా సాంకేతిక కమిటీ ప్రతిపాదనలు పంపింది.

## ఢిల్లీ కాలుష్యం : ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోమ్



**ఢిల్లీ:** దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తోంది. గాలి నాణ్యతా సూచీ 400లకు పైగా నమోదవుతోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటినుంచే పని చేయాలని ఆదేశించింది. కాలుష్య తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని పర్యావరణ శాఖ మంత్రి గోపాల్‌రాయ్ ప్రకటించారు. దేశ రాజధానిలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి ఢిల్లీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులోభాగంగా 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటినుంచే పని చేయాలని ఆదేశించింది. దీని అమలు కోసం బుధవారం సచివాలయ అధికారులతో సమావేశం నిర్వహించ నున్నాం" అని ఢిల్లీ పర్యావరణశాఖ మంత్రి గోపాల్‌రాయ్ సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఢిల్లీలోని మున్సిపాలిటీ పరిధిలోని కార్యాలయాలు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మిగిలిన ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఢిల్లీలో వాయు కాలుష్యం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజలు తీవ్రమైన కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నారు. ఈ ఉదయం గాలి నాణ్యత సూచీ 422గా నమోదైంది. చాలా ప్రాంతాల్లో ఇది 500 మార్క్‌ను దాటడంతో వాతావరణ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనివల్ల ఇప్పటికే పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాలుష్యం నేపథ్యంలో సుప్రీంకోర్టులోని ఏ కేసులైనా సరే లాయర్లు వర్చువల్ మోడ్‌లో పాల్గొని తమ వాదనలు వినిపించొచ్చని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. వాయు కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు కృత్రిమ వర్షం కురిపించేలా చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్‌రాయ్ తాజాగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.




## 5.8 కోట్ల నకిలీ రేషన్ కార్డుల ఏరివేత

**ఢిల్లీ:** డిజిటైజేషన్ వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థలో భారీ స్థాయిలో మార్పులు వచ్చాయని, తద్వారా ఆహార భద్రతలో ప్రపంచానికే బెంచ్ మార్క్‌ను నెలకొల్పినట్లయ్యిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ వ్యవస్థ ద్వారా దేశంలో మొత్తంగా 80.6కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతుండగా.. ఆధార్ ధ్రువీకరణ, ఈకేవైసీ వెరిఫికేషన్ల ద్వారా 5.8కోట్ల నకిలీ రేషన్ కార్డులు తొలగిపోయాయని పేర్కొంది. కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఇప్పటివరకు 20.4కోట్ల రేషన్ కార్డుల డిజిటలీకరణ పూర్తయ్యింది. దేశవ్యాప్తంగా 5.33 లక్షల చౌకధరల దుకాణాలకు ఈపోస్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి సాయంతో 99.8శాతం కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయగా, 98.7శాతం లబ్ధిదారుల ధ్రువీకరణ పూర్తయ్యింది. మరోవైపు ఈ కేవైసీ ప్రక్రియతో ఇప్పటివరకు 64శాతం లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తయ్యింది. ఆహార పదార్థాల సరఫరా విషయంలోనూ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పకడ్బందీగా వ్యవహరిస్తోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సరకు రవాణాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్‌నూ రైల్వేలతో అనుసంధానించామని తెలిపింది. ఇక వన్ నేషన్-వన్ రేషన్ కార్డు పథకంతో లబ్ధిదారులు దేశంలో ఎక్కడైనా సరకులు తీసుకునే అవకాశం కలిగిందని తెలిపింది.

# ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళ్తున్నాం

**అమరావతి:** గతంలో ఎన్నడూ లేనివిధంగా 2024 ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. 150 రోజుల్లో తమ ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పారు. వైకాపా పాలనలో జరిగిన అక్రమాలపై ఎంత తవ్వితే అంత భయంకరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు. శాసనసభలో సీఎం మాట్లాడారు. "నాలుగు దశాబ్దాలుగా ప్రజలు నన్ను ఆదరించారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాను. ప్రజల కోసం నిరంతరం అధ్యయనం చేస్తూ నిత్య విద్యార్థిలా నేర్చుకున్నాను. ఎన్నో కష్టాలు చూశా.. అవమానాలు ఎదుర్కొన్నా. 24 క్లైమోర్‌మైన్స్‌తో దాడి చేస్తే వేంకటేశ్వరస్వామి పునర్జన్మ ప్రసాదించి ప్రాణభిక్ష పెట్టారు. ఈ సభలోనే నా కుటుంబసభ్యులను అవనమానపరిచేలా మాట్లాడారు. ఆ సమయంలో తీవ్ర ఆవేదన కలిగింది. వేధింపులకు గురిచేసి చివరికి జైలుకు పంపించారు. నేను ఏ తప్పూ చేయలేదు.. చేయను. అనుక్షణం ప్రజల కోసమే పనిచేస్తా. అలాంటి ఇబ్బందులు పెట్టినప్పుడు ఇంకా మనోధైర్యంతో ముందుకెళ్లాను. చాలా అరుదైన సంఘటనలు నా జీవితంలో చూశాను. 53 రోజులు జైల్లో ఉన్నప్పుడు ప్రపంచదేశాల్లోని తెలుగువారు రోడ్డు పైకి వచ్చి పోరాడారు. ప్రజలు ఇచ్చిన స్థానాన్ని ఎవరు చెరపాలన్నా చెరగదు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాను. ఇది అరుదైన అనుభవం. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారు. అధికారం, సీఎం కుర్చీ, కేంద్ర రాజకీయాలు కూడా కొత్త కాదు. ప్రాంతీయ పార్టీగా తెదేపా కేంద్రంలో ఎన్నోసార్లు కీలకపాత్ర పోషించింది. విధ్వంసమైన వ్యవస్థలు, గాడితప్పిన యంత్రాంగం, గత ప్రభుత్వ అప్పులు, తప్పులు ఈ



ప్రభుత్వానికి సవాలుగా మారాయి. ఈ రాష్ట్రాన్ని బాగు చేయగలమనే నమ్మకముందా? అని కొందరు అడిగారు. నేను పారిపోను.. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజల కోసమే పనిచేశా. ఇప్పుడు కూడా అలాంటి సవాల్‌ను స్వీకరించి మళ్లీ ప్రజలను నిలబెడతానని చెప్పాను. అది చేసి తీరతానని ముందుకొచ్చాను. 21 మంది ఎంపీలతో దిల్లీలో మన పరపతి పెరిగింది. ఒక్కో ఇటుకా పేరుస్తూ ముందుకెళ్తున్నాం. రాత్రికి రాత్రే ఏదీ సాధ్యం కాదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు ప్రజలకు తెలియజేయాలి. అంకితభావంతో పనిచేస్తూ రాజీ లేకుండా ముందుకెళ్తాం.

**ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్** : వైకాపా ప్రభుత్వం శాంతిభద్రతలను గాలికొదిలేసిందని సీఎం చంద్రబాబు విమర్శించారు. శాసనసభ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. "గత ప్రభుత్వ హయాంలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాజకీయ నాయకులను నిర్వీర్యం చేయాలనే ప్రయత్నం చేశారు. ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్.. ఊరుకునేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున ర్యాలీ చేపడతాం. పిల్లలకు కూడా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎవరైనా భూకబ్జాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నా" అని చంద్రబాబు చెప్పారు.

# వైకాపా ప్రతిపాదనల కారణంగానే ట్రూఅప్ ఛార్జీల వసూలు

**అమరావతి:** ఏపీలో విద్యుత్ వ్యవస్థను వైకాపా ప్రభుత్వం నాశనం చేసిందని, ఆ వ్యవస్థను నిర్వహించడంలో విఫలమైందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం పీపీఏల రద్దు సహా చేసిన తప్పిదాల కారణంగా ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల పేరిట రూ.20 వేల కోట్లపైగా భారం పడిందన్నారు. గత ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై పెను భారం వేసిందన్నారు. గత ప్రభుత్వం ఈఆర్సీకి పంపిన ప్రతిపాదనల వల్లే ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేయాల్సి వస్తుందని మంత్రి వివరణ ఇచ్చారు. ట్రూ అప్ ఛార్జీలు వసూలుకు గత వైకాపా ప్రభుత్వమే కారణమన్నారు. ట్రూఅప్ ఛార్జీలపై శాసన మండలిలో ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

# అప్పులపై అన్ని పార్టీలతో కమిటీ వెయ్యండి



**అమరావతి:** ప్రశ్నోత్తరాల సమయం అంటే ప్రశ్నకి సమాధానం చెప్పాలి. కానీ, మంత్రి సభలో ఆవు కథ చెబుతున్నారని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. అప్పుల పై అన్ని పార్టీలతో కమిటీ వెయ్యండి. అప్పుడు.. ఎన్ని అప్పులు ఉన్నాయో తెలుస్తామన్నారు. కూటమి నేతలు ఆరోపణలు చేయడం సమంజసం కాదు. వాస్తవాలు చెబితే అభ్యంతరం లేదు. మంత్రి కేశవ్ తప్పుడు లెక్కలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. మంత్రులు ఏం చెప్తే అది చెవిలో పువ్వులు పెట్టుకుని వినాలా? అంటూ బొత్స మండిపడ్డారు. శాసన మండలిలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటన చేయగా.. దానికి బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం తెలిపారు. అటు శాసనసభలోనూ చంద్రబాబు సైతం వ్యక్తిగత గొప్పలతో సభలో కాలయాపన చేశారు. ఏపీ అప్పులు 6.46 లక్షల కోట్లు అని ప్రకటించారు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్. 2024 జూన్ నాటికి 4,91,734 కోట్లు బడ్జెట్ అప్పులు ఉన్నాయని, కార్పొరేషన్ ల ద్వారా 1,54,797 కోట్లు అప్పులయ్యాయని అన్నారాయన. అదే టైంలో.. గత ప్రభుత్వం 9 లక్షల 74 వేల కోట్లు చేసిందంటూ తీవ్ర ఆరోపణలకు దిగారు.

**నేను బుడమేరు బాధితుడ్నే: ఎమ్మెల్సీ రుహుళ్ల**

శాసన మండలి బుడమేరు వరదల పై మండలిలో చర్చ జరిగింది. ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ ప్రసంగిస్తూ.. బుడమేరుకి 4 సార్లు వరద వస్తే 3 సార్లు చంద్రబాబు హయాంలో నే వచ్చింది. బుడమేరు ఆధునికీకరణ కోసం 2014 నుండి 2019 వరకు ఏమైనా ఖర్చు చేశారా?. బుడమేరు వరదల పై కేంద్ర బృందాలు ఎంత నష్టం గుర్తించింది. కేంద్ర ప్రభుత్వం ఎంత సహాయం చేసింది, ఎంత ఖర్చు చేశారు..?

ఆపరేషన్ బుడమేరు నెల రోజుల్లో ప్రారంభిస్తాం అన్నారు. ఎప్పుడు స్టార్ట్ చేస్తారో చెప్పాలి?. నష్టపరిహారం సక్రమంగా చేస్తే బాధితులు ఎందుకు కలెక్టర్ ఆఫీస్ దగ్గర ధర్నాలు చేస్తున్నారు? అని ప్రశ్నించారు.

ఎమ్మెల్సీ రాహుల్ల ప్రసంగిస్తూ.. నేను కూడా వరద బాధితుడిని. వరద వచ్చేముందు ప్రజలు కనీసం ప్రజలను అప్రమత్తం చెయ్యలేదు. అధికారులు ఏం చేస్తున్నారు. సింగ్ నగర్ ప్రజలను ముంచేశారు. మజీద్ వెళ్లి వచ్చే లోపే మా ప్రాంత ప్రజలంతా ముంపుకి గురయ్యారు అని అన్నారు. అయితే బుడమేరు పరిధిలో ఆంధ్ర జ్యోతి రాధ కృష్ణ పవర్ ప్లాంట్ ఉందని ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ గుర్తు చేశారు.

**ప్రభుత్వ ఉద్యోగాల లెక్క ఏది? : ఎమ్మెల్సీ మాధవరావు**

శాసన మండలి.. ప్రభుత్వ ఉద్యోగ ల భర్తీ పై మండలి లో చర్చ జరిగింది. రాష్ట్రంలో మొత్తం శాఖల్లో ఎన్ని ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయో చెప్పడం లేదని వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ మాధవరావు అన్నారు. "గత ప్రభుత్వం లో లక్ష 34 వేల సచివాలయ ఉద్యోగాలు భర్తీ చేశాం.2014 నుండి 2019 మధ్య లో ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశారో చెప్పాలి" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. దానికి మంత్రి పయ్యావుల కేశవ్.. రాష్ట్రంలో అన్ని శాఖల ఖాళీల పై.మదింపు చేస్తున్నాం. ఇంకా ఖాళీల వివరాలు రావాల్సి ఉందన్నారు.

# గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలు



**అమరావతి:** ఏపీలో గత ప్రభుత్వ పాపం, నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయవాడలో బుడమేరు వాగుకు వచ్చిన వరదలపై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. బుడమేరు డైవర్షన్ కెనాల్ పూర్తిచేయడంలో వైకాపా ప్రభుత్వం విఫలమైందని మంత్రి నిమ్మల తెలిపారు. గత ఐదేళ్లలో బుడమేరు డైవర్షన్ కెనాల్ పనుల పూర్తికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. ఒకేసారి 15 వేల క్యూసెక్కుల నీరు రావడంతో గండ్లు పడి వరదలు వచ్చాయని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే బుడమేరుకు వరదలొచ్చాయని, భవిష్యత్తులో వరదలు రాకుండా ఆపరేషన్ బుడమేరు చేపడతామని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. అదేవిధంగా గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో పురపాలక శాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఘాట్ల నిర్మాణాన్ని జలవనరుల శాఖ తీసుకుంటుందని ఆయన తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పుష్కరాలకు ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ప్రతిరోజూ గోదావరి హారతి నిర్వహించాలని నిర్ణయించామని మంత్రి చెప్పారు. అయితే గత ఐదేళ్లలో గోదావరి హారతిని నిలిపివేశారన్న మంత్రి.. ప్రజల సంస్కృతి, సంప్రదాయాలపై కూడా వైకాపా ప్రభుత్వం దాడి చేసిందన్నారు.

# సంపూర్ణ అభివృద్ధి దిశగా ఏపీ..: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

**అమరావతి:** తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా ఉండటానికి సీఎం చంద్రబాబు ముఖ్య కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. "అక్రమ కేసులతో జైలులో పెట్టి చంద్రబాబును ఇబ్బంది పెట్టారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసింది. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని వైకాపా ప్రభుత్వం వెనక్కి తీసుకెళ్లింది. వాళ్ల వరుస దోపిడీలు, అరాచకాలను చూసే ప్రజలు మనకు మద్దతు పలికారు. రాష్ట్ర భవిష్యత్తు పట్ల విశ్వాసాన్ని తీసుకొచ్చిన చంద్రబాబుకు ధన్యవాదాలు. 150 రోజుల కూటమి ప్రభుత్వ పాలనతో సంతృప్తి చెందాం. ఏపీ సంపూర్ణ అభివృద్ధి దిశగా వెళ్తుందని మనస్ఫూర్తిగా విశ్వసిస్తున్నా" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

# వలంటీర్లను దారుణంగా మోసం చేశారు

**అమరావతి:** వలంటీర్ వ్యవస్థ విషయంలో వైయస్ఆర్‌సీపీ అనుమానాలే నిజమయ్యాయని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం వలంటీర్లను దారుణంగా మోసం చేస్తారని, ఆ వ్యవస్థను రద్దు చేసే కుట్ర జరుగుతోందని చెబుతూ వస్తుందన్నారు ఇప్పుడు మంత్రి సమాధానంతో ఆ కుట్రే నిజమని తేలిందన్నారు. వలంటీర్ వ్యవస్థపై ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో మంటలు చేగాయి. ఈ వ్యవస్థకు సంబంధించి ప్రశ్నోత్తరాల టైంలో వైయస్ఆర్‌సీపీ ఈ అంశాన్ని లేవనెత్తగా.. ప్రభుత్వం నుంచి దిగ్భ్రాంతికి గురి చేసే సమాధానం వచ్చింది. "రాష్ట్రంలో వలంటీర్లు పని చేయడం లేదు. అసలు వలంటీర్ వ్యవస్థే లేదు. లేనివ్యవస్థ ను అసలు ఎలా కొనసాగిస్తాం. ఒకవేళ కొనసాగిస్తేనే జీతాలు పెంచుతాం అన్నాం. అసలు కొనసాగించలేదు.. కాబట్టి జీతాలు పెంచం" అని ఏపీ సాంఘిక సంక్షేమ మంత్రి బాల వీరాంజనేయులు బదులిచ్చారు. దీంతో మండలిలో మంటలు చెలరేగాయి. మంత్రి సమాధానంపై వైయస్ఆర్‌సీపీ భగ్గుమంది. "ఎన్నికల్లో మీరు వలంటీర్లకు 10 వేలు గౌరవ వేతనం ఇస్తామన్నారు. కానీ, ఇప్పుడు మంత్రి అసలు వ్యవస్థ లేదనడం దారుణం. రెన్యూవల్ జీవో మీరు ఇవ్వొచ్చు కదా!" అని మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ నిలదీశారు. "వాలంటీర్ల గౌరవ వేతనం పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. 5 వేలు వేతనాన్ని 10 వేలు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఎన్నికలు అయ్యాక వాలంటీర్ల ను మోసం చేశారు" అని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు.



# ఇండియా కూటమిలో మరికొన్ని పార్టీలు చేరతాయి



**అన్నానగర్ న్యూస్:** తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సెల్వ పెరుంతగై ఈ రోజు నెల్లికి వచ్చారు. వన్నారపేటలోని ప్రభుత్వ పర్యాటక గృహంలో విలేకరులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఇలా అన్నారు."అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఈ రోజు వేల్లూరులో పర్యటించింది. వేల్లూరు జిల్లాలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనులను పరిశీలించిన తర్వాత కలెక్టర్ కార్యాలయంలో జరిగే తనిఖీ సమావేశంలో పాల్గొనబోతున్నాం. కన్యాకుమారి నుండి వచ్చిన సమయంలో మేము నంగునేరి టెక్నాలజీ పార్కును సందర్శించాం. అక్కడి పరిశ్రమల అధికారులతో చర్చలు జరిపాం. కళాకారుడి పాలనలో ప్రారంభమైన నంగునేరి పారిశ్రామిక పార్కు పలు వ్యాజ్యాల కారణంగా ప్రస్తుతం స్తంభించి ఉంది."

# కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ



**విల్లివాకం న్యూస్:** పాకిస్తాన్ నేవీ అరెస్టు చేసిన జాలర్లను విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ రాశారు. 03 జనవరి 2024న గుజరాత్‌లోని పోర్‌బందర్ నుండి చేపల వేటకు వెళుతుండగా 14 మంది భారతీయ మత్స్యకారులతో పాటు తమిళనాడుకు చెందిన 7 మంది మత్స్యకారులను పాకిస్తాన్ నేవీ అరెస్టు చేసింది. ఈ కేసులో అరెస్టయిన మత్స్యకారులను, వెంటనే విడుదల చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ బుధవారం కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ రాసిన లేఖలో 14 మంది భారతీయ మత్స్యకారులలో 7 మంది మత్స్యకారులు తమిళనాడుకు చెందినవారని, గుజరాత్‌లోని పోర్‌బందర్ నుండి IND-GJ-25-MM-34580 IND- GJ-25-MM-1582 రిజిస్ట్రేషన్ నంబర్లు కలిగిన మోటారు పడవలలో చేపల వేటకు వెళ్లగా వారిని నేవీ అరెస్టు చేసి జైలులో ఉంచి దాదాపు 10 నెలలు గడిచిందన్నారు. ఇంకా, మత్స్యకారుల విడుదలలో దీర్ఘకాలిక అనిశ్చితి ఏర్పడిందని మరియు వారిపై ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

# డీఎంకే పాలనలో కత్తిపోట్లపై చర్యలేమి? : తమిళిసై



**అన్నా నగర్ న్యూస్:** తంజావూరు జిల్లా మల్లిపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు రమణిని కత్తితో పొడిచి హత్య చేసిన ఘటనపై బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందరరాజన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె తన ఎక్స్ పేజీలో (మాజీ ట్విట్టర్) ఇలా వ్యాఖ్యానించారు: "ప్రభుత్వ ఆసుపత్రిలోనే కత్తిపోట్లు... ప్రభుత్వ పాఠశాలలో కత్తిపోట్లు... కోర్టు ఆవరణలోనే కత్తితో దాడి... ఇది డీఎంకే పాలనలో రోజువారీ వ్యవహారంగా మారింది. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ చర్యలు తీసుకోకుండా, పంచ్‌లైన్ వ్యాఖ్యలతో సరిపెడుతోంది. ఈ పరిస్థితిని 'ద్రావిడ మోడల్' అని పిలవడం తమాషాగా ఉంది. ప్రజలు శాంతి భద్రతల పట్ల తక్షణ చర్యలు కోరుతున్నారు." తమిళిసై చేసిన ఈ వ్యాఖ్యలు డీఎంకే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలకు దారి తీసేలా ఉన్నాయి.

# కొసపేటలో అయ్యప్ప స్వామి ఆలయ మహా కుంభాభిషేకం



**వేలూరు న్యూస్ :** వేలూరు పట్టణంలో ఉన్న కొనపేట క్రిష్ణస్వామి రోడ్డులో ఉన్న పాలగన్ అయ్యప్పస్వామి ఆలయ మహా కుంభాభిషేక వైభవం బుధవారం ఉదయం జరిగింది. ముందుగా రాణిపేట చిప్కాడులోని శ్రీ నవ శబరి అయ్యప్పన్ ఆలయ స్థాపకులు శ్రీశ్రీ శేషాద్రి స్వామి వారికి జీర్ణోద్ధరణ మహా కుంభాభిషేక వైభవం జరిగింది. అనంతరం 26వ వార్షిక దీపారధన పూజలు అత్యంత వైభవంగా జరిగింది. ఇందులో జయచంద్ర గురుస్వామి అద్యక్షతన జరిగిన వీటిలో సురేష్, గోపి, శరవణన్, గ్రామ ప్రజలతో పాటు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

# పొన్నేరి పాఠశాలలో వికలాంగుల వైద్య శిబిరం



**పొన్నేరి న్యూస్ :** తిరువళ్లూరు జిల్లా మీంజూర్ యూనియన్ పరిధిలోని పొన్నేరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంటెగ్రేటెడ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో వికలాంగుల కోసం మెడికల్ ఎవాల్యుయేషన్ క్యాంపు నిర్వహిం చారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరం లో 600 మందికి పైగా దివ్యాంగులు పాల్గొన్నారు. వైద్య శిబిరంలో కొత్త గుర్తింపు కార్డులు, UDID కార్డ్ నమోదు, ప్రయాణ రాయితీ, వైద్య బీమా సదుపా యాలు అందించడంతో పాటు దృష్టి, వినికిడి, శారీరక, మేధోపరమైన లోపాల కోసం ప్రత్యేక వైద్య సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకళ, వికలాంగుల సంక్షేమాధికారి శ్రీనివాసన్, సూపర్‌వైజర్ సెంథిల్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



# ఉన్నత స్థాయి కార్యాచరణ ప్రణాళిక కమిటీ

**విల్లివాకం న్యూస్:** డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అధ్యక్షతన బుధవారం చెన్నైలోని అన్నా అరివాలయంలో డీఎంకే హైలెవల్ యాక్షన్ ప్లాన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 6 తీర్మానాలను ఆమోదించారు. తమిళనాడును అభివృద్ధి చేస్తున్న ముఖ్య మంత్రికి అభినందనలు. బాలికలకు ఉచిత బస్సు ప్రయాణం, బాలికలకు ప్రతినెలా వెయ్యి రూపాయలు ఇచ్చే కలైంజర్ మహిళా హక్కుల కార్యక్రమం తదితర పథకాలు. అన్నజగన్ స్కూల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్, అన్నల్ అంబేద్కర్ ఇండస్ట్రియల్ పయనీర్స్ ప్రాజెక్ట్ వంటి భారతదేశానికి ఆదర్శంగా నిలిచే ప్రాజెక్టులను అమలు చేయడం ద్వారా ముఖ్య మంత్రి ఎం.కె.స్టాలిన్ ద్రవిడన్ మోడల్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ప్రతి ఒక్కరి డిమాండ్లను విని, పథకాలను అమలు చేసే ముఖ్యమంత్రిగా, అదే సమయంలో- సచివాలయం నుంచి పాలన సాగిస్తే సరిపోదని ప్రతి జిల్లాలో ప్రత్యక్ష క్షేత్ర పరిశోధనకు శ్రీకారం చుట్టి భారతదేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాగే జిల్లాల వారీగా జరుగుతున్న పార్టీ పనులను జిల్లాల వారీగా స్వయంగా పరిశీలిస్తున్నారు. పార్టీ నిర్వాహకులను వ్యక్తిగతంగా కలుస్తూ వారి ఆలోచనలను తెలుసుకుని తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ప్రభుత్వ పనులు, పార్టీ పనులు ఏకకాలంలో చేస్తున్న ద్రవిడ నాయక ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌ను ఈ ఉన్నతస్థాయి కార్యాచరణ ప్రణాళిక కమిటీ హృదయపూర్వకంగా అభినందిస్తోంది.

# హొసూరులో న్యాయవాది హత్య!



**గిండీ న్యూస్:** క్రిమినల్ కోర్టు వద్ద న్యాయవాది కన్ననును కొడవలితో నరికి చంపిన ఘటన సంచలనం సృష్టించింది. న్యాయవాది ఆనందన్ అరివాల్ వద్ద ప్రాక్టీస్ చేస్తున్న జూనియర్ లాయర్ కన్ననును కోర్టు ఆవరణలో దాడి చేసి చంపారు. ఈ దాడికి సంబంధించిన వీడియో ఫుటేజ్ బయటకు రావడం అందరిని షాక్‌కు గురి చేసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, వ్యక్తిగత శత్రుత్వం ఈ హత్యకు కారణమై ఉండవచ్చని అనుమానిస్తు న్నారు. అయితే, న్యాయవాది పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయనను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కోర్టు న్యాయవాదులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ నిరసన కార్యక్రమాలకు దిగారు.





# 22, 25 తేదీలలో ఫిబా ఆసియా కప్ 2025

**విల్లివాకం న్యూస్:** చెన్నైలోని తాజ్ క్లబ్ హౌస్ తమిళనాడు క్రీడా చరిత్రలో స్మారక కార్యక్రమాన్ని నిర్వహించింది. మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో అంతర్జాతీయ పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నది. ఫిబా ఆసియా కప్ 2025 క్వాలిఫైయర్స్ (విండో 2) 2024 నవంబర్ 22 మరియు 25 తేదీలలో చెన్నైలోని ప్రఖ్యాత నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరుగనుంది. ఈ టోర్నమెంట్ ఆసియా అంతటా 24 జాతీయ జట్లను ప్రదర్శిస్తుంది, అన్నీ ఆసియా ప్రీమియర్ పురుషుల బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో స్థానం కోసం పోటీపడతాయి. భారత సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు నవంబర్ 22న ఖతార్‌తోనూ, నవంబర్ 25న కజకిస్థాన్‌తోనూ తలపడనుంది. ఈ చారిత్రాత్మక ఈవెంట్‌కు చేరడానికి తమిళనాడు వ్యాప్తంగా ఉన్న సాంకేతిక అధికారులు, కోచ్‌లు, అనుభవజ్ఞులైన ఆటగాళ్లు మరియు అభిమానులతో సహా బాస్కెట్ బాల్ ఔత్సాహికులందరినీ తాము స్వాగతిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో అజెజ్ అహ్మద్, ఈసి సభ్యుడు, సెక్రటరీ తమిళనాడు బాస్కెట్‌బాల్ అసోసియేషన్, స్కాట్ ఫ్లెమింగ్, హెడ్ కోచ్ ఇండియా, ఆదవ్ అర్జున, అధ్యక్షుడు, బిఎఫ్ఐ, చెంగల్రాయ నాయుడు, ట్రెజరర్ బిఎఫ్ఐ, నార్మన్ స్వరూప్ ఐజాక్, టెక్నికల్‌కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

# మహిళా సైక్లిస్టులకు ఉదయనిధి అభినందనలు



**విల్లివాకం న్యూస్:** తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన 76వ జాతీయ ట్రాక్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన తమిళనాడుకు చెందిన మహిళా సైక్లిస్టులు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను కలుసుకుని అభినందనలు అందుకున్నారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఇలా పేర్కొంది. తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ 15.11.2024న చెంగల్పట్టు జిల్లా మేలకొట్టయ్యూరులోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్ వద్ద పోటీలు నిర్వహించారు. 28 రాష్ట్రాలు మరియు 8 కేంద్రపాలిత ప్రాంతాల నుండి 700 మందికి పైగా సైక్లిస్టులు పోటీలో పాల్గొన్నారు, వీరిలో తమిళనాడు నుండి 41 మంది పురుష మరియు మహిళా అథ్లెట్లు ఉన్నారు.

## కేంద్ర మాజీ మంత్రి చిదంబరానికి ఊరట



**ఢిల్లీ:** ఎయిర్సెల్- మ్యాక్సిస్ మనీలాండరింగ్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థికశాఖ మంత్రి పి.చిదంబరానికి ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై విచారణకు అనుమతిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయస్థానం నిలిపివేసింది. సింగిల్ జడ్జి ధర్మాసనం ఈమేరకు ఈడీకి నోటీసులు జారీ చేసింది. ఎయిర్ సెల్- మ్యాక్సిస్ కేసులో చిందంబరం, ఆయన కుమారుడు కార్తీ చిదంబరంపై ట్రయల్ కోర్టులో ఈడీ ఛార్జిషీట్‌లు దాఖలు చేసింది. దీంతో ఆయనపై విచారణకు ట్రయల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఆ ఉత్తర్వులను నిలిపివేయాలంటూ చిందంబరం హైకోర్టును ఆశ్రయిచగా.. తాజాగా ఆయనపై విచారణను నిలిపివేసింది. చిదంబరం కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎయిర్‌సెల్- మ్యాక్సిస్ ఒప్పందంలో ఫారిన్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు అనుమతుల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. ఈక్రమంలోనే చిదంబరంతో పాటు ఆయన కుమారుడు కార్తీ చిదంబరంపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ, ఈడీ రెండు వేర్వేరు ఛార్జిషీట్లను 2018లో దాఖలు చేసింది.

## ఢిల్లీలో కాలుష్యం.. ప్రతి ఇంటా బాధితులే

**ఢిల్లీ:** దేశ రాజధానిలో కాలుష్య తీవ్రత కొనసాగుతూనే ఉంది. గాలి నాణ్యతా సూచీ ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతోంది. అనేక రంగాల కార్యకలాపాలపై ప్రభావం చూపు తోంది. ఈ క్రమంలో ఢిల్లీలో ప్రతి ఇంటిలో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తాజా సర్వే వెల్లడించింది. నగరంలో అనేక చోట్ల కాలుష్య స్థాయిలు 450పైగా కొనసాగు తున్నాయి. అటు పీఎం2.5 కూడా తీవ్రంగానే ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనేక మంది ఢిల్లీ వాసులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు లోక్ సర్కిల్స్ నివేదిక వెల్లడించింది. ఢిల్లీలో 75శాతం కుటుంబాల్లో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది గొంతునొప్పి లేదా దగ్గుతో బాధపడుతున్నట్లు తెలిపింది. కాలుష్య స్థాయిలు పెరుగుతోన్న నేపథ్యంలో 58శాతం కుటుంబ సభ్యుల్లో తలనొప్పి, 50శాతం శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని తాజా సర్వే పేర్కొంది. ఇలా బాధపడుతున్న వారి సంఖ్య నెలలోనే రెట్టింపు అయ్యిందని తెలిపింది.



# నటి కస్తూరికి కోర్టులో కండిషనల్ బెయిల్

**విల్లివాకం న్యూస్:** నటి కస్తూరికి కోర్టులో కండిషనల్ బెయిల్ లభించింది. గత 3వ తేదీన చెన్నైలో బ్రాహ్మణ సంఘం తరపున జరిగిన సభలో నటి కస్తూరి తెలుగువారి పరువు తీశారని ఆరోపించబడింది. కస్తూరి తన ప్రసంగానికి చింతిస్తున్నట్లు చెప్పగా, నాయుడు మహాజన సంఘం ఆమెపై పరువు నష్టం చర్య తీసుకోవాలని మదురై తిరునగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా, తెలంగాణలోని హైదరాబాద్ సమీపంలోని పప్పలకుంటలోని సినీ నిర్మాత హరికృష్ణన్ బంగ్లాలో ఉంటున్న కస్తూరిని ప్రత్యేక దళం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, ఆమెను పులల్ మహిళా జైలులో జ్యుడీషియల్ కస్టడీకి తరలించాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో నటి కస్తూరి ఎగ్మోర్ కోర్టులో బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ



పిటిషన్ బుధవారం విచారణకు వచ్చినప్పుడు, నటి కస్తూరి తనకు ఆటిజం బిడ్డ ఉన్నాడని, దానిని పరిగణనలోకి తీసుకుని తనకు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. దీంతో ఆమెకు కండిషనల్ బెయిల్ లభించింది.

## ఢిల్లీ.. గ్యాంగ్‌స్టర్లకు రాజధానిగా మారింది



**ఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్యాంగ్‌స్టర్లకు ఈ ప్రాంతం రాజధానిగా మారిందన్నారు. ఇటీవల హత్యకు గురైన యువకుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆమె.. కేంద్రమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఢిల్లీలో శాంతిభద్రతలు క్షీణించాయని అన్నారు. ఇటీవల సుందర్ నగరీలో ఇద్దరు వ్యక్తులు ఓ మహిళను వేధిస్తుండగా.. ఆమె కుటుంబీకులు, బంధువులు ఆ యువకులను మందలించారు. అనంతరం ఆ ఇద్దరు కత్తులతో చేసిన దాడిలో 28 ఏళ్ల వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బాధిత కుటుంబాన్ని కలిసిన సీఎం ఆతిశీ వారిని పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం అందించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో పాల్గొన్న ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు.

"ఢిల్లీ గ్యాంగ్‌స్టర్లకు రాజధానిగా మారింది. నేరస్థులు, దోపిడీదారులు, గూండాలకు భయం లేకుండా పోయింది. ఇప్పుడు ఒక వ్యక్తి ప్రాణాలు బలి తీసుకున్నారు. కానీ, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేరని రెచ్చిపోతున్నారు. దేశ హెూంమంత్రి అమిత్ షా నుంచి ఓ విషయం తెలుసుకోవాలనుకుంటున్నాను. ఢిల్లీ శాంతిభద్రతల బాధ్యత తన చేతుల్లోకి వచ్చాక ఆయన ఏం చేశారు..? శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి. దోపీడీలు, హత్యలు పెరిగిపోతున్నాయి. అయినప్పటికీ.. ఆయనకు ప్రచారం తప్ప వేరే బాధ్యతలు లేనట్లుగా అనిపిస్తోంది" అంటూ ఆతిశీ విమర్శించారు.

## కల్తీ సారా కేసు సీబీఐకి బదిలీ



**గిండీ న్యూస్:** జూన్ 18న కల్తీ మద్యం కారణంగా కళ్లకురిచ్చిలో 68 మంది మరణించిన ఘటనపై మద్రాసు హైకోర్టు కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయాలని ఆదేశించింది. ఈ కేసు సీబీసీఐడీ నుంచి సీబీఐకి బదిలీ చేయాలని అన్నాడీఎంకే, బీజేపీ, బీఏఎంలు పిటిషన్ దాఖలు చేయగా, న్యాయమూర్తులు డి.కృష్ణకుమార్, పి.ధర్మాసనం సీబీఐ విచారణకు అనుమతిచ్చారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఈ తీర్పును స్వాగతిస్తూ, తమ పార్టీ నిరంతర పోరాట ఫలితంగా ఇది సాధ్యమైందని వ్యాఖ్యానించారు.

